

నచ్చితే.. తమ అసలుసిసలు వారసుడు మురారిదేవుడు వీరవిహారం చేయడం కాకతీయ సామ్రాజ్యానికి శుభ సూచకమని ఎక్కువమంది భావించారు. గణపతిదేవ దంపతులు పులకించారు. బిడ్డలిద్దరూ అత్యుత్తమ యుద్ధ వీరులైతే.. ఆ తల్లిదండ్రుల పరమానందానికి హద్దు ఏముంటుంది! ఏదేమైనా ఇద్దరూ రాణించడం గణపతిదేవునికి, నారాంబకు కొంత ఉపశమనం కలిగించింది.. జాయచోడునికి కూడా!!

అయితే మరునాడు వినవచ్చిన చక్రవర్తి నిర్ణయం జాయచోడుణ్ని ఆశ్చర్యానికి గురిచేసింది.

''యువరాజు మురారిదేవుల వారిని పాకనాడు మండలేశ్వరునిగా నియమించారు''

* * *

జాయసేనాపతి ప్రశాంతంగా కవిగాయక గోష్ఠులతో తన గ్రంథరచనను సుసంపన్నం చేస్తున్నాడు. గీతాలు, గేయాలపై ఒక గ్రంథం, వాద్యసంగీతంపై మరో గ్రంథం, నృత్తంపై ఇంకో గ్రంథం ప్రారంభించాడు. గురుకులాలు పర్యటించడం.. అక్కడ పండిత గోష్ఠులను నిర్వహించడం.. తన గ్రంథరచనకు కావాల్సిన సమాచారాన్ని కూడ గట్టడం ఆయన నిత్యకృత్యం. దేశీ కళారూపకాలు, జానపద గేయాలు, వాద్య విశేషాలు సేకరిస్తుంటాడు.

సాధారణ జనులు మాట్లాడే తెలుగు, రాసేలిపి కూడా స్పష్టమై కన్నడం, తమిళం ఇక్కడ కనుమరుగయ్యాయి. కన్నడ మాతృభాష అనుకున్నవాళ్లు ఆ రాజ్యాలకు వెళ్లిపోయారు. అలాగే తమిళ భాష ప్రజలం అనుకున్న వాళ్లు దిగువకు వెళ్లిపోయారు.

ఆయా ఇతర భాషారాజ్యాల నుంచి తెలుగువారు కాకతీయ సామ్రాజ్యంలోకి వచ్చేశారు. సంస్కృతభాషలోనే కాక తెలుగుభాషలో కూడా ఎన్నో క్రొత్త గ్రంథాలు వెలువడుతున్నాయి. ఎందరో యువకవులు, పండితులు, విద్యావేత్తలు, లేఖకులు, శాసన రచయితలు, వందిమాగధులు సాహితీసృష్టిపై దృష్టిపెట్టి అద్భుతమైన రచనలు చేస్తున్నారు. అప్పుడప్పుడూ దూరదేశాల నుంచి కూడా పండితులు తమతమ రచనలతో జాయసేనాపతిని కలుస్తుంటారు. జాయచోడుడు గొప్ప యుద్ధయోధుడుగా.. అంత కుమించి రణతంత్ర నిపుణునిగా.. అత్యద్భుత నాట్యకారునిగా.. నాట్యగురువుగా.. నాట్యకళా విశారదుడిగా.. కాకతీయ సామ్రాజ్యంలోనే కాదు ఇటు దక్షిణావర్తంలోనూ అటు ఆర్యావర్తంలోనూ భరతముని తర్వాత అంతటి నాట్యమునిగా వెలుగొందుతున్నాడు.

దేశం నలు మూలలనుంచి ఎందరో నాట్యకారులు, సాహితీవేత్తలు, ఆయన్ను కలిసి చర్చించడానికి, నాట్య మెలకువలు నేర్చుకోవడానికి తండోపతండాలుగా వస్తూనే ఉంటారు.

''చిదంబరం నటరాజును దర్శించుకోవడానికి బయలుదేరాం. మధ్యలో ముందు మీ దర్శనం మాకు అత్యంత ఆనందదాయకం''..

ఇది భరత ఖండపు కళాకారులు ముక్తకంఠంతో పలికే మాట!!

* * *

'తక్షణం రావలసింది. మురారిదేవుడు పరిపాలిస్తున్న పాకనాడు పక్కనున్న కందవోలు రాజ్యపాలకుడు నందమ రాయని చెరసాలలో మురారి బందీగా ఉన్నాడు'

చారుడు తెచ్చిన లేఖను చదివి దిగ్భ్రమ చెందాడు జాయచోడుడు. వెంటనే కదిలాడు.

నిజానికి మురారిని పాకనాడు పాలకుడిగా నియమించడం.. ఆలోచిస్తే సబబేమో అనుకున్నాడు జాయచోడుడు. ఇందువల్ల గణపతిదేవుడు రెండు ప్రయోజనాలు సాధించాడు. రెండు కత్తులు ఒకే ఒరలో ఇమడవు. ఇద్దరినీ పరీక్షిస్తున్న అతిముఖ్యమైన కాలం ఇది.

రుద్రమదేవి అనుమకొండకు రావడం మురారికి సహజంగానే సుతరామూ ఇష్టంలేదు. ఆమెను తిరిగి తెచ్చిన మేనమామ శత్రువై పోయాడు. ఆయనతో అంటీ ముట్టనట్లున్నాడు. ఇది గుర్తించిన జాయచోడుడు ఇదొక భేదోపాయంగా మురారి గుర్తిస్తాడని ఆశించాడు.

తనను ఆనాడు వెలనాడు మండలీశ్వరునిగా పంపినట్లే.. మురారిని కూడా పాకనాడు పాలకుడిగా పంపాడు.

అనుమకొండలో తండ్రి ప్రభావాన మురారి కొంత స్వేచ్ఛగా ప్రవర్తించలేకపోవచ్చు. చిన్న సామంతరాజ్య పాలకుడిగా పాలన కష్టసుఖాలను అనుభవంతో గ్రహించవచ్చు. అయితే అది కేవలం సమర్థింపు వాదన మాత్రమే.

జాయచోడుడు రాజాస్థానానికి వచ్చాడన్న వార్త పురంలో వ్యాపించి.. పండితులు, విద్యావేత్తలు, కళాకారులు, ఆస్థాన నర్తకి మొదలైన దేవదాసి, వేశ్య ప్రముఖులు, వణిజులు, సమయశెట్టి ప్రముఖులు రాజమందిరానికి వచ్చేశారు. అందగాడైన జాయచోడుడు ఈ వయసులో కూడా స్వచ్ఛమైన కళాతేజస్సుతో వెలిగిపోతున్నాడు. అందరూ రెప్పవెయ్యకుండా అలా చూస్తూనే ఉంటున్నారు.

గణపతిదేవుడు సామ్రాజ్య స్థాపన తంత్రాలతో తలమునకలై ఉండగా.. రుద్రమ తండ్రి తరఫున పాలనాపగ్గాలను అందుకుంది. గొప్పగా రాణిస్తోందని శుక్ర, అంకమరట్ట చెబుతున్నారు. ముఖ్యంగా జలవనరుల నిర్వహణలో ఆమె తండ్రిని మించిన ప్రతిభను చూపుతోందని రైతులు సంతోషంగా ఉన్నారట.

తండ్రి ఆలోచనను అందుకున్నవారే అసలుసిసలు వారసులు.. అది కొడుకైనా.. కూతురైనా. మురారి గుర్తొస్తే కాకతీయ సామ్రాజ్య భవిష్యత్తుపై దిగులు పెరుగుతుంది. రుద్రమను చూస్తే ఆశ పెరుగుతుంది. హుటాహుటిన రాజధానికి తిరిగి వచ్చి గణపతిదేవుని ముందు నిలబడ్డాడు.

''కిం కర్తవ్యం?'' అందరిని ఉద్దేశించి అన్నాడు చక్రవర్తి గణపతిదేవుడు.

సాక్షాత్తూ కాకతీయ సామ్రాజ్య యువరాజుని చెరసాలలో బంధించడం.. చిన్నవిషయం కాదు. అందరూ జాయచోడుని వంక చూశారు.

''సరే.. నా ప్రయత్నం నేను చేస్తాను..'' అన్నాడు.

మందిర ద్వారం దాటేముందు బావగారి వంక చూశాడు. ఆయన దీనంగా చూస్తూ వెంట వస్తున్నాడు.

విక్రమను అధిరోహిస్తూ..

''అక్కకు చెప్పండి. ఆమె కొడుకును క్షేమంగా తీసుకొస్తానని..'' అన్నాడు.

బయటకు వచ్చాడు. ఏమి చెయ్యాలి? తను ఒంటరి! కాస్త గుండెనిబ్బరం కలిగించే తోడు ఉంటే బావుండును.

కాకతి!! వచ్చి అశ్వం పక్కగా నిలబడి..

'నేనూ వస్తున్నాను పద..' అన్నట్లు తోచింది!

కాస్త ఊపిరి తీసుకుని ఆత్మవిశ్వాసంతో విక్రమను ముద్దుగా కదిపాడు. మొదట వేగులను పంపి ధనదుప్రోలులో ఒక సైనిక పటాలాన్ని సిద్ధం చేయించాడు. మార్జువాడి పాలకుడు ఒపిలిసిద్ధి సహాయం తీసుకోమన్న గణపతిదేవుని సూచనపై అతనికి ఆహ్వానం పంపాడు. సైనిక పటాలాన్ని పొలిమేరల్లో ఉంచి కందెనవోలు రాజధాని కందవోలు ప్రవేశించాడు.

గణపతిదేవుడు పెద్దసేనతో దండెత్తి వస్తాడని ఊహించిన మార్జువాడి పాలకుడు నందనరాయడు ఒంటరిగా ప్రవేశించిన జాయచోడుణ్ని చూసి ఆశ్చర్యపోయాడు. మహానాట్యకారుడిగా మన్ననలు పొందుతున్న జాయచోడునికి పూర్ణకుంభ స్వాగతంతో ఆహ్వానించాడు.

''మహామహా పండితులకు మాత్రమే దక్కే ఈ పూర్ణకుంభ స్వాగతం శూద్రుడనైన నాకు ఇవ్వడం మీ ఔదార్యానికి నిదర్శనం నందనరాయా.. కృతజ్ఞతలు!''

జాయచోడుడు రాజాస్థానానికి వచ్చాడన్న వార్త పురంలో వ్యాపించి.. పండితులు, విద్యావేత్తలు, కళాకారులు, ఆస్థాన నర్తకి మొదలైన దేవదాసి, వేశ్య ప్రముఖులు, వణిజులు, సమయశెట్టి ప్రముఖులు రాజమందిరానికి వచ్చేశారు. అందగాడైన జాయచోడుడు ఈ వయసులో కూడా స్వచ్ఛమైన కళాతేజస్సుతో వెలిగిపోతున్నాడు. అందరూ రెప్పవెయ్యకుండా అలా చూస్తూనే ఉంటున్నారు.

కళాయుద్ధం తర్వాత వెలనాడు పరిసర రాజ్యాలలో జాయచోడుని పేరు మార్మోగిపోతోంది. చేబ్రోలు, ధనదవోలు మధ్య వెలసిన ఓ గ్రామానికి జాయప్రోలు అని పేరు పెట్టుకున్నారు.

ఆయనపట్ల ప్రజల్లో ఉన్న ఆకర్షణ చూసి నందనరాయడు ఆశ్చర్యపోయాడు.

''ఆ నీచుడు తమరి మేనల్లుడు అయినందుకు మేము ఆశ్చర్యపోతున్నాం జాయచోడదేవా!'' అన్నాడు రాయడు.

**(సశేషం)**